# మత్స్యకారులకు అండగా ఉంటాం

- చేపల పెంపకంలో అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజానావ, సిరిసిల్ల:** మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా చంద్రంపేటలోని రైతు వేదికలో నేషనల్ అగ్రో ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మత్స్య రైతుల దినోత్సవ వేడుకల్లో విప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఉత్తమ ప్రతిభ కనబరిచిన సొసైటీ సభ్యులకు ప్రశంస పత్రాలు అందజేసి సన్మానించారు. అనంతరం చేపల స్టాల్స్ ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో మత్స్య సంపద పెంపొందించడానికి తనవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల మంత్రి శ్రీహరి కరీంనగర్ వచ్చినప్పుడు వారితో చేపల పెంపకం, మత్స్యకారుల గురించి మాట్లాడం జరిగిందన్నారు. ప్రభుత్వం అన్ని చెరువుల్లోకి సకాలంలో చేప పిల్లలు పంపిణీ చేస్తుందని తెలిపారు. బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందజేస్తుందన్నారు. గతంలో మిడ్ మానేరులో చేపలను వదలడం జరిగిందని, ఇప్పుడు మన ప్రాంతంలో మల్కపేట్ రిజర్వాయర్ కుడా అందుబాటులోకి వచ్చిందని వాటిలో కూడా చేపల పెంపకం ఏర్పాట్లు విధానం పరిశీలించాలని సూచించారు.

**గతంలోనే చెరువుల మరమ్మతులు పూర్తి**

గతంలోనే తెగిపోయిన చెరువులు మరమ్మతులు పూర్తిచేశామని విప్ ఆది గుర్తుచేశారు. ఇంకా ఎక్కడైనా చెరువుల మరమ్మతులుంటే చేపడతానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే కథాలపూర్ మండలం లోని తెగిపోయిన చెరువులను మరమ్మతులు చేశామన్నారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చెసి ఎల్లారెడ్డిపేట వరకు రైతులకు సాగు నీరు అందించినట్లు పేర్కొన్నారు. గతంలో మిడ్ మానేరు డ్యాంలో కేజీ కల్చర్ విధానంలో చేపల పెంపకం కోసం ముంపు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించామని, కేజీ కల్చర్ చేపల పెంపకం చేపట్టడం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేపల పెంపకంలో అధునాతన సాంకేతిను అందిపుచ్చు కోవాలన్నారు. కేజీ కల్చర్ విధానంలో చేపల పెంపకానికి ముందుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తామని తెలిపారు. దేశంలో మత్స్య సంపద పెరగాలని చేపలు ఆరోగ్యానికి మంచిదని, ప్రభుత్వం మత్స్యకారులకు అనేక రకాలుగా ప్రోత్సాహకాలు అందజేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే నూతన పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే చాలావరకు హామీలను పూర్తిచేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, జిల్లా ఫిషరీస్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, డీఏవో అఫ్జల్ బేగం, మల్లికార్జున్, పీ. కిషోర్, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సునీల్ కుమార్, అడ్వైజర్ విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



# గురువులు మార్గనిర్దేశం చేసే మహానుభావులు

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత రామచంద్రారెడ్డి**

**ప్రజానావ, ఖైరతాబాద్:** గురువులు జీవితాన్ని మార్గనిర్దేశం చేసే మహానుభావులని, వారి ఆశీస్సులతోనే మన ప్రయాణం సార్థకమవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింత రామచంద్రారెడ్డి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ఆయన స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బంజారాహిల్స్ డివిజన్, ప్రేమ్ నగర్ కాలనీలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలున్నారు.



గురు పౌర్ణమి సందర్భంగా సగర కుల గురువు శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి విగ్రహానికి గురువారం ఫిలింనగర్ సగర ఉప్పర సంఘం నాయకులు ఆవుల రాజన్న సగర, గుంటి నాగేష్ సగర, ఎస్పీ శ్రీను సగర, మెడల విష్ణు సగరతో పాటు సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

- ప్రజానావ, ఖైరతాబాద్

# యోగా మాస్టర్‌కు సన్మానం



**ప్రజానావ, గంభీరావుపేట:** యోగ మాస్టర్ పెరిమెల్లి దేవయ్యను మార్నింగ్ వాకర్స్ సభ్యులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. గురు పౌర్ణమి సందర్భంగా గత కొన్ని రోజుల నుండి స్థానిక కేజీ టు పీజీ క్యాంపస్‌లో యోగను ఉచితంగా నేర్పిస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ సభ్యులు సుంకోజు రమేష్, డాక్టర్ చింత చిరంజీవి, డాక్టర్ సత్యనారాయణ, మూడ రమేష్, దేవసాని కృష్ణ, దోసల శ్రీనివాస్, ఎస్ బాలరాజు, జి నాగరాజు, ఎస్ సుధాకర్, వాసం రాజారాం తదితరులు పాల్గొన్నారు.

# ఆత్రం సుగుణను సన్మానించిన బోరంచు



**ప్రజానావ, ఆదిలాబాద్:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా నియమితులై తొలిసారిగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆత్రం సుగుణను తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సన్మానించారు. మావల బైపాస్ వద్ద కాంగ్రెస్ శ్రేణులతో కలిసి గురువారం ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి నివాసంలో జిల్లా రాజకీయాలు, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అధిష్టానం పెద్దలు టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారని తెలిపారు. ఈ పదవులను బాధ్యతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. ఈనెల 11న రాజ్యసభ సభ్యులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్ యాదవ్, నల్గొండ పార్లమెంట్ సభ్యులు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కుందూరు రఘువీర్ రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్నారని తెలిపారు.

వారి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం 2గంటలకు జిల్లా కేంద్రంలోని రత్న గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం ఉ ంటుందని అన్నారు. ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి ఇది ఓ కీలక సందర్భమని పేర్కొన్నారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా నుండి ఇక్కడి సమస్యలు తెలిసిన నాయకురాలిగా ఉన్న సుగుణను పార్టీ కీలక బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ సామ రూపేష్ రెడ్డి, సీనియర్ నాయకులు నలిమెల నవీన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, కోఆప్షన్ మెంబర్ రహీం ఖాన్, రేండ్ల రాజన్న, అంబడి అక్షయ్, సునీల్ జాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### ఐఐటీ మద్రాస్‌తో సిరిసిల్ల ప్రభుత్వ హైస్కూల్

# భాగస్వామ్యం

**విద్యార్థులకు అక్కడ చదువుకునే ఛాన్స్**

**ఆన్‌లైన్ విధానంలో రెండు నెలల కోర్సులు.. ఆగస్టు నుంచి ప్రారంభం**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు జడ్పీహెచ్ఎస్ (గర్ల్స్) స్కూల్‌ల ఎంపిక**




**ప్రజానావ, సిరిసిల్ల:** స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో భాగంగా ఐఐటీ మద్రాస్ తో సిరిసిల్ల ప్రభుత్వ హై స్కూల్ భాగస్వామ్యమైంది. ఈ విషయాన్ని ఐఐటీ మద్రాస్ ఈ మెయిల్ ద్వారా నిర్ధారణ చేస్తూ ప్రభుత్వ హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడికి లేఖ రాసింది. పాఠశాల విద్య, ఉన్నత విద్య మధ్య అంతరాన్ని తగ్గించడం లక్ష్యంగా ఐఐటీ మద్రాస్, సెంటర్ ఫర్ ఔట్రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్ (సీఓడీఈ) ద్వారా స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాం ప్రారంభించబడింది. ఈ ప్రోగ్రాంలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలు ఎంపికయ్యాయి. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు టెక్నాలజీ, సామాజిక శాస్త్రాలను పరిచయం చేస్తే భవిష్యత్తులో వారు ఆవిష్కర్తలుగా మారేందుకు గట్టి పునాది వేయనుంది. ఐఐటీ మద్రాస్, స్కేలర్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీతో కలిసి పనిచేయనుంది. ఈ భాగస్వామ్యంలో, ఐఐటీ మద్రాస్ విద్యార్థులకు ఆన్‌లైన్ కోర్సులు అందిస్తోంది. ఇందులో భాగంగా డేటా సైన్స్ అండ్ ఏఐ, ఏరోస్పేస్, ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, ఇంజినీరింగ్ బయోలాజికల్ సిస్టమ్స్, మ్యాథ్స్ అన్‌ప్లగ్‌డ్: గేమ్స్ అండ్ పజిల్స్, పర్యావరణం, ఫన్ విత్ మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, లా, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, హ్యూమానిటీస్ వంటి 8 వారాల వ్యవధితో పది కోర్సులను ఐఐటీ మద్రాస్ విద్యార్థులకు అందించనుంది. ఇందుకోసం విద్యార్థుల నుంచి నామమాత్ర రుసుం వసూలు చేస్తుంది. పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో ఆగస్టు నుంచి ప్రారంభమయ్యే ఈ కోర్సులు రెండు నెలల పాటు జరుగుతాయి. అనంతరం విద్యార్థులకు కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లు అందిస్తారు. ఈ కోర్సుల్లో భాగంగా రికార్డు చేసిన వీడియోలను క్లాసుకు సంబంధించిన సమయంలో ప్రతి సోమవారం పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ఐఐటీ ప్రొఫెసర్‌లతో ప్రతి శనివారం లైవ్‌లో మాట్లాడే ఉంటాయి. ఏవైనా సందేహాలు ఉంటే అడగొచ్చు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలలో నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం లభిస్తుంది. ఇది వారి ఉన్నత విద్య తో పాటు భవిష్యత్తులో కెరీర్ ఎంపికలకు సహాయపడుతుంది.

**విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు**

ఐఐటీ మద్రాస్, సెంటర్ ఫర్ ఔట్రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్ (సీఓడీఈ) ద్వారా స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంకు మా పాఠశాల భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉ ంది. విద్యార్థులు డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన రంగాల్లో ప్రొఫెసర్ల నుంచి నేరుగా నైపుణ్యాలను నేర్చుకునే అవకాశం లభిస్తుంది. ఈ కార్యక్రమం విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది.

- చకినాల శ్రీనివాస్,
ప్రధానోపాధ్యాయులు,
సిరిసిల్ల ప్రభుత్వ పాఠశాల

